అధ్వానంగా రోడ్లు..

- వర్షాలకు బురదమయం
- ఇబ్బంది పడుతున్న గిరి ప్రజలు
- పట్టించుకోని అధికారులు



ప్రమాదకరంగా మారిన ఎంపల్లి రోడ్డు

నార్నూర్: నార్నూర్, గాదిగూడ మండలాల్లోని గ్రామాల్లోని రోడ్లు అధ్వానంగా మారాయి. కొన్ని గ్రామాలకు ఏళ్లుగా రవాణా సౌకర్యం లేదు. మరికొన్ని గ్రామాలకు రవాణా పూర్తిగా స్తంభించింది. వర్షాలు కురిస్తే చాలు రోడ్లు బురదమయం అవుతోంది. పలుచోట్ల కోతకు గురై ప్రమాదకరంగా ఉన్నాయి. రాకపోకలు సాగించాలంటే వాహనదారులు భయాందోళన చెందుతున్నారు. పాదాచారులకు నడక నరకప్రాయంగా మారింది. వర్షాకాలంలో వాగులు దాటి వెళ్లాల్సిన పరిస్థితి. ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు కొన్ని గిరిజన గ్రామాలు బాహ్య ప్రపంచానికి దూరంగా ఉన్నాయి. దీంతో గిరిప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అయినా సంబంధిత శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని వాపోతున్నారు.

- నార్నూర్ మండలంలోని మల్లెంగి పంచాయతీ పరిధిలో మల్లెంగి బారిక్‌రావుగూడలో దాదాపు 200 కుటుంబాలున్నాయి. గ్రామానికి వెళ్లడానికి వాగు దాటాల్సి ఉంటుంది. వర్షాకాలం వస్తే చాలు గిరిజనులు పడే బాధలు వర్ణనాతీతం. అత్యవసర సమయంలో ఎడ్లబండిలో లేదా ఎత్తుకొని వాగు దాటాల్సిన పరిస్థితి. వర్షాకాలంలో దాదాపు రెండు నెలలు ఈ గ్రామం బాహ్య ప్రపంచానికి దూరంగా ఉంటుంది. ఖంపూర్, మాదాపూర్ గ్రామాలకు రాకపోకలకు అంతరాయం కలుగుతుంది.
- బాబేఝరి పంచాయతీ పరిధిలోని దన్నుగూడలో 100 కుటుంబాలున్నాయి. గ్రామానికి వెళ్లడానికి వాగు ఉండడంతో వర్షాకాలంలో రాకపోకలు నిలిచిపోతుంది. గాదిగూడ మండలం గనేష్‌పూర్‌కు రోడ్డుమార్గం లేక బాహ్య ప్రపంచానికి దూరంగా ఉంది. దాదాపు 200 పైగా కుటుంబాలు ఉంటున్నాయి. గ్రామం చుట్టూ వాగు ఉండడంతో వ్యవసాయానికి సంబంధించిన సామగ్రిని నెల ముందే తెచ్చుకుంటారు.
- గాదిగూడ మండలం పావునూర్ లొద్దిగూడకు రోడ్డు అధ్వానంగా ఉంటుంది. కనీసం బైక్‌లు వెళ్లలేని పరిస్థితి. 10 కి.మీ బీటీ రోడ్డు నోచుకోలేదు. గాదిగూడ మండలం పావునూర్, కట్టగూడ, కునికాసా, లోకారి(కే) రాజులగూడ గ్రామాలకు రోడ్డు లేక గిరిజనులు అవస్థలు పడుతున్నారు.

సీఎం దృష్టికి..

ఈ ఏడాది గిరిజన గ్రామాల్లో రోడ్డు సౌకర్యం కల్పించాలని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే ఆత్రం సక్కు చొరవ తీసుకుని ఈ విషయాన్ని సీఎం చంద్రశేఖర్ దృష్టికి తీసుకెళ్లారు. మంత్రుల సహకారంతో గాదిగూడ మండలంలో పావునూర్, లొద్దిగూడ, కునికాసా, ఖడోడి, పున్నగూడ, ఖండోవ్ నుంచి ముధురతండా, నార్నూర్ మండలంలోని ఎంపల్లి, బారిక్‌రావుగూడ, బాబేఝరి దన్నుగూడ తదితర గ్రామాలకు రోడ్ల మంజూరుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. కొన్ని గ్రామాలకు రోడ్లు మంజూరైనప్పటికి అటవీశాఖ అనుమతుల కోసం వేచిచూడాల్సి వస్తోంది.

చర్యలు తీసుకుంటాం

గిరిజన గ్రామాల్లో రోడ్లు నిర్మించి ప్రజలకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటాం. స్థానిక ఎమ్మెల్యే ఆత్రం సక్కు సహకారంతో గాదిగూడ, నార్నూర్ మండలాలోని సమస్యాత్మక గ్రామాల రోడ్డు మంజూరుకు ప్రతిపాదనలను ప్రభుత్వానికి అందించాం. కొన్ని గ్రామాలకు మంజూరైంది. త్వరలో పనులు ప్రారంభించి పూర్తి చేయిస్తాం.

– రాథోడ్ జనార్దన్, జెడ్పీ చైర్మన్ ఆదిలాబాద్

అత్యవసర సమయంలో అంతే..

అత్యవసర సమయంలో గాదిగూడ, నార్నూర్ లేదా ఝరి పీహెచ్‌సీల వెళ్లాలంటే గ్రామస్తులు పడరాని పాట్లు పడుతున్నారు. మండల కేంద్రానికి వెళ్లడానికి రోడ్డు సరిగా లేదు. వర్షానికి బురదగా మారడంతో ఇబ్బంది పడాల్సి వస్తోంది. గర్భిణులు, బాలింతలు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు వైద్యపరీక్షల నిమిత్తం ఆస్పత్రులకు వెళ్లేందుకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

పంటల నమోదు తప్పనిసరి..

- క్లస్టర్ వారీగా సర్వే
- సాగు వివరాలు సేకరిస్తున్న ఏఈవోలు



ఇస్పూర్‌లో పంట వివరాలు నమోదు చేస్తున్న ఏఈవో (ఫైల్)

నేరడిగొండ: వర్షాకాలంలో సాగు చేస్తున్న పంటల సాగు వివరాల సేకరణలో వ్యవసాయ శాఖ నిమగ్నమైంది. ఇప్పటికే భారీ వర్షాలతో పంటలు దెబ్బతిన్న ప్రాంతాల్లో సర్వే పనుల్లో తలమునకలైన వ్యవసాయ శాఖ అధికారులు తాజాగా పంటల నమోదు ప్రక్రియ చేపడుతున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో ఏఈవోలు పంటల సాగు వివరాలను నమోదు చేస్తున్నారు.

సాగు వివరాలు..

రైతులకు విశేష సేవలందించడమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ శాఖపై ప్రత్యేక దృష్టిసారించింది. రైతులకు 24 గంటల నాణ్యమైన విద్యుత్ తోపాటు రైతుబంధు, బీమా పథకాలను పకడ్బందీగా అమలు చేస్తుండడంతో ప్రభుత్వానికి వ్యవసాయ శాఖపై గట్టి నమ్మకం ఏర్పడింది. దీంతో రైతులకు మరింత చేరువ కావడంతోపాటు వారికి సేవలందించాలనే లక్ష్యంతో రైతువేదిక, కల్లాల నిర్మాణాలను సైతం ప్రభుత్వం చేపట్టింది. గతంలో పంటల సాగుపై అధికారులు తూతూమంత్రంగా సర్వే చేసేవారు. దీంతో క్షేత్రస్థాయిలో పంట సాగు అనంతరం దిగుబడిపై ప్రభుత్వం వద్ద నిర్దిష్టమైన వివరాలు లేకపోవడంతో ఇబ్బందిగా ఉండేది. పంటల సాగు వివరాల నమోదుతో రైతులకు కావల్సిన విత్తనాలు, ఎరువులతోపాటు ప్రతి సీజన్‌కు రైతు ఉత్పత్తులు ఏ విధంగా వస్తాయని ప్రభుత్వం అంచనా వేయడానికి అనుకూలంగా ఉంటుంది. దీంతో వారికి గిట్టుబాటు ధర సైతం అందే అవకాశాలు ఉన్నాయి. పంటల నమోదు ప్రక్రియ అటు రైతులకు ఇటు ప్రభుత్వానికి ఎంతో ఉపయోగకరంగా ఉండనుంది.

రైతులు సహకరించాలి

పంట నమోదు ప్రక్రియకు రైతులు సహకరించాలి. ప్రతి పంట వివరాలు అందించాలి. క్లస్టర్ గ్రామాల్లో ఏఈవోలు అందుబాటులో ఉంటారు. వర్షాకాలంలోసాగు చేస్తున్న పంట వివరాలు అందించిన తర్వాత ఆన్‌లైన్‌లో పొందుపర్చుతాం.

– పుల్లయ్య, జిల్లా వ్యవసాయ అధికారి

ప్రజలను మోసగించిన బీజేపీని ఎండగట్టాలి

- ఎమ్మెల్యే జోగు రామన్న



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే జోగు రామన్న

కైలాస్‌నగర్: గ్యాస్ ధరలు తగ్గిస్తాం.. జన్‌ధన్ ఖాతాల్లో రూ.15లక్షల చొప్పున జమ చేస్తామని చెప్పిన ప్రధాని మోదీ తొమ్మిదేళ్ల పాలనలో ఏం చేశారని ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న ప్రశ్నించారు. ఎన్నికల్లో ఓట్లు అడిగేందుకు వచ్చే బీజేపీ నాయకులను నిలదీయాలని ప్రజలకు సూచించారు. మంగళవారం తన క్యాంప్ కార్యాలయంలో 196 మందికి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్‌తో కలిసి పంపిణీ చేశారు. డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు అజయ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వాగు దాటి వైద్యం



వాగు దాటి వెళ్తున్న వైద్య సిబ్బంది

ఇచ్చోడ: మండలంలోని నర్సాపూర్ పీహెచ్‌సీ సిబ్బంది మంగళవారం కాలినడకన వెళ్లి వాగు దాటి వైద్యం అందించారు. పీహెచ్‌సీ పరిధిలోని నారాయణ్‌పూర్, పాలవాగు, కుంటగూడ గ్రామాలకు మంగళవారం వైద్యం సిబ్బంది రాథోడ్ కృష్ణ, ఏఎన్ఎం రేణుకా దాదాపు 3 కి.మీ దూరం వెళ్లారు. అనంతరం గర్భిణులు, బాలింతలకు టీకా అందజేశారు.

'అక్రమ ఆస్తులను ఆధారాలతో నిరూపిస్తా'

ఆదిలాబాద్‌రూరల్: ఎమ్మెల్యే జోగు రామన్నపై తాను చేసిన సవాల్‌కు కట్టుబడి ఉన్నానని, ఆయన సంపాదించిన అక్రమ ఆస్తులను ఆధారాలతో నిరూపిస్తానని కాంగ్రెస్ నాయకుడు కంది శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఆదిలాబాద్‌లోని ఆయన కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఎమ్మెల్యే అక్రమాలపై నిలదీస్తే తనపై క్రిమినల్ కేసులు నమోదు చేయిస్తావా అని ప్రశ్నించారు. కోర్టులో కేసు వేస్తానని హెచ్చరించినా రామన్న వారి ప్రభుత్వం అధికారంలో ఉన్నందున సిట్టింగ్ జడ్జిని నియమించుకుని విచారణ చేయించాలన్నారు. ఎమ్మెల్యే తనయుడు ప్రేమేందర్ బడా వ్యాపారులతో కలిసి రియల్ వ్యాపారం చేస్తున్నారని ఆరోపించారు. ఎమ్మెల్యే అక్రమ ఆస్తులపై ఆధారాలు నిరూపించకపోతే తాను రాజకీయాల నుంచి తప్పుకుంటానని ప్రకటించారు. తనపై దాడికి యత్నించినవారిపై పోలీసులు కేసులు నమోదు చేయకపోతే కోర్టుకెళ్తానన్నారు. నాయకులు భరత్ వాఘ్మరే, గిమ్మ సంతోష్, మడావి రాజు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

ఇచ్చోడ: బీజేపీ బలోపేతానికి శక్తి కేంద్రాల ఇన్‌చార్జీలు కృషి చేయాలని పార్టీ పార్లమెంటరీ ఫుల్ టైమర్ రవి అన్నారు. మండల కేంద్రంలో పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు కేంద్రే నారాయణ అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ పటిష్టతకు ప్రతీ కార్యకర్త కలిసికట్టుగా పనిచేయాలని కోరారు. బీఆర్ఎస్ అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించాలన్నారు. సమావేశంలో బోథ్ అసెంబ్లీ కన్వీనర్ సూర్యకాంత్ గిత్తె, అసెంబ్లీ ఫుల్‌టైమర్ భూమేశ్, జిల్లా ఉపాధ్యక్షుడు బాబారావు, మండల ప్రధాన కార్యదర్శి రమేశ్, నాయకులు గాయక్‌వాడ్ దశరథ్, జాదవ్ రాములు పాల్గొన్నారు.

మంత్రి హరీశ్‌రావును కలిసిన జెడ్పీటీసీ



మంత్రికి వినతిపత్రం ఇస్తున్న జెడ్పీటీసీ

తలమడుగు: రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి హరీశ్‌రావును హైదరాబాద్‌లో జెడ్పీటీసీ గోక గణేశ్‌రెడ్డి మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. మండలానికి ఆరోగ్య కేంద్ర భవనం మంజూరు చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు. శిథిలావస్థకు చేరిన వైద్యుల క్వార్టర్ స్థానంలో నూతన భవనం నిర్మించాలని, మండలానికి, వైద్యుల కోసం అంబులెన్సులు మంజూరు చేయాలని వినతిపత్రం అందజేశారు. గతంలో కురిసిన భారీ వర్షాలకు పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం డబ్బులు విడుదల చేయాలని కోరగా, మంత్రి సానుకులంగా స్పందించినట్లు జెడ్పీటీసీ తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఆదిలాబాద్‌రూరల్: తెలంగాణ సాంఘిక సంక్షేమ ప్రతిభ కళాశాల ఆదిలాబాద్‌లో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ఎంపీసీ, బైపీసీ గ్రూప్‌ల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎస్. శ్రీనివాస్ ఓ ప్రకటనలో తెలిపారు. 8.0 జీపీఏ పైగా ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు ఈనెల 5లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మెరిట్ ఆధారంగా ఎంపిక ఉంటుందని పేర్కొన్నారు.

రూ.లక్ష ఆర్థికసాయం అందించాలి

సిరికొండ: కులవృత్తులకు మాదిరిగా కుమ్మరులకు రాష్ట్రప్రభుత్వం రూ.లక్ష ఆర్థికసాయం వెంటనే అందించాలని సంఘం మండల అధ్యక్షుడు నెలుట్ల రాజేశ్వర్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో మంగళవారం ఏర్పాటు సమావేశంలో ఆయన మాట్లాడారు. తమకు ఆర్థికసాయం అందజేయకుంటే జిల్లాకేంద్రంలోని కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడి చేస్తామన్నారు. సంఘం సభ్యులు పాల్గొన్నారు.

వరద బాధితులను ఆదుకోవాలి



మాట్లాడుతున్న వెడ్మ బొజ్జు పటేల్

ఇంద్రవెల్లి: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నష్టపోయిన రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెడ్మ బొజ్జుపటేల్ డిమాండ్ చేశారు. టీపీసీసీ పిలుపుతో మండలకేంద్రంలోని ప్రెస్ క్లబ్‌లో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా 60కు పైగా మంది చనిపోతే కేబినెట్ సమావేశంలో కనీసం సంతాపం ప్రకటించకపోవడం దారుణమన్నారు. ఖానాపూర్ నియోజకవర్గంలోని వరద బాధితులను పరామర్శించాల్సిన బాధ్యత ఎమ్మెల్యేకు లేదా అని ప్రశ్నించారు. సమావేశంలో మండల అధ్యక్షుడు ముఖడే ఉత్తం, మాజీ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సోమసే వెంకట్‌రావ్, నాయకులు మెస్రం నాగ్‌నాథ్, చహకటి మాణిక్‌రావ్ పాల్గొన్నారు.

ఎకరాకు రూ.50 వేలు చెల్లించాలి

నేరడిగొండ: భారీ వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం ఎకరాకు రూ.50 వేలు చెల్లించాలని ఏఐసీసీ సభ్యుడు, బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ నరేశ్‌జాదవ్ డిమాండ్ చేశారు. మండలంలోని కుమారి పరిసర గ్రామాల్లో మంగళవారం ఆయన పర్యటించారు. భారీ వర్షాల కారణంగా తీవ్రంగా నష్టపోయిన పంటలు, కోతకు గురైన భూములను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నష్టపోయిన వారికి వెంటనే పరిహారం చెల్లించాలని పేర్కొన్నారు. టీపీసీసీ ఎస్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోటేష్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ నాగ్‌నాథ్ అప్పా, ఇచ్చోడ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఆసిఫ్‌ఖాన్, పార్టీ బోథ్ ఎస్టీ సెల్ అధ్యక్షుడు గంగారాం, నాయకులు రాజుగౌడ్, నరేశ్‌రెడ్డి, చంద్రశేఖర్ ఉన్నారు.

పంటలు పరిశీలన



పంట పరిశీలిస్తున్న సుజాత

ఆదిలాబాద్‌రూరల్: వరదలతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం వెంటనే పరిహారం అందజేసి ఆదుకోవాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గండ్రత్ సుజాత కోరారు. ఆదిలాబాద్ రూరల్ మండలంలోని బుర్నూర్‌లో భారీ వర్షాలతో నష్టపోయిన పంట పొలాలు, వర్షానికి కూలిన ఇళ్లను సోమవారం పరిశీలించారు. పార్టీ తరఫున వారికి ఆర్థికసాయం అందజేశారు. నాయకులు అరిగేలా కిష్టయ్య, అరె పోచన్న, ఆనంద్, నర్సింగ్, సురేష్, ప్రభాకర్‌రెడ్డి, గంగయ్య, విఠల్, కిష్టు, గంగారెడ్డి తదితరులు ఉన్నారు.

నష్టపరిహారం చెల్లించాలి



మాట్లాడుతున్న సంతోష్‌సింగ్

నేరడిగొండ: వరదల కారణంగా దెబ్బతిన్న పంటలకు, ఆస్తి నష్టం జరిగిన వారికి ప్రభుత్వం వెంటనే నష్టపరిహారం చెల్లించాలని బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి సాబ్లే సంతోష్‌సింగ్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల కురిసిన వర్షాలకు, వరదలకు పంటలు దెబ్బతినడంతో పాటు పలువురికి ఆస్తి నష్టం జరిగిందని తెలిపారు. రెవెన్యూ, వ్యవసాయ అధికారులు సర్వే చేపట్టి నష్టపోయిన వారికి రూ.25 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. విపత్తు నిర్వహణ నిధి కింద రూ.988 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం దగ్గర ఉన్నాయని, అందులో నుంచి తక్షణమే వరద బాధితులకు ఆర్థికసాయం అందించాలన్నారు. పట్టణ అధ్యక్షుడు రాథోడ్ రాజశేఖర్, గిరిజన మోర్చా మండల అధ్యక్షుడు రాథోడ్ ఉద్దల్ సింగ్, దళిత మోర్చా మండల ప్రధాన కార్యదర్శి సురేష్, బీజేవైఎం సోషల్ మీడియా కన్వీనర్ అభిలాష్, బీజేపీ ఓబీసీ మోర్చా మండల కార్యదర్శి శేఖర్, కిష్టాపూర్ పోలింగ్ బూత్ అధ్యక్షుడు అజయ్ పాల్గొన్నారు.

గ్రామాల్లో తల్లిపాల వారోత్సవాలు



ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది, పోషకులు

సిరికొండ: మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రం-2లో మంగళవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. అంగన్‌వాడీ టీచర్ రాణి ఆధ్వర్యంలో గ్రామంలో పోషకులతో ర్యాలీ చేపట్టారు. అనంతరం తల్లీపాలపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ ఆయా నర్సవ్వ, పోషకులు పాల్గొన్నారు.

ఉట్నూర్‌రూరల్: స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. నర్సాపూర్(బి)లో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ పెందూర్ కళావతిబండు, సూపర్‌వైజర్ సంధ్యారాణి, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ఎదులాపురం: పట్టణంలోని సుందరయ్యనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాల్లో ఖుర్షీద్ నగర్ యూహెచ్‌సీ స్టాఫ్‌నర్స్ ధార్మిక పాల్గొన్నారు. అంగన్‌వాడీ టీచర్ రాధ మాట్లాడుతూ ఈ వారోత్సవాలు ఈనెల 7వ తేదీ వరకు కొనసాగుతాయన్నారు. అనంతరం కాలనీ పురవీధుల్లో తల్లిపాల ప్రాముఖ్యతను తెలుపుతూ ర్యాలీ నిర్వహించారు. ఆశ వర్కర్లు స్వప్న, రాజునా, ఏఎల్ఎంఎస్ కమిటీ సభ్యులు భగీర్థ, నవిత, సెహనాజ్ పాల్గొన్నారు.

గొప్ప సాహితీవేత్త అన్నాభావు సాఠే

- జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్



మహనీయుల చిత్రపటాలకు పూలమాలలు వేస్తున్న నాయకులు

ఇంద్రవెల్లి: ప్రపంచంలోనే గొప్ప సాహితీవేత్త అన్నాభావు సాఠే అని జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్ అన్నారు. మండల కేంద్రంలో సాహితీ సామ్రాట్ అన్నాభావు సాఠే జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ సాఠే ఆశయ సాధనకు కృషిచేయాలన్నారు. జెడ్పీటీసీ ఆర్క పుష్పలత, పీఏసీఎస్ చైర్మన్ మారుతి డోంగ్రె, అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్ మండల అధ్యక్షులు సోన్‌కాంబ్లే మనోహర్ తదితరులు ఉన్నారు.

నార్నూర్: మండలంలోని తాడిహత్నూర్‌లో అన్నాభావుసాఠే విగ్రహానికి వైస్ ఎంపీపీ జాదవ్ చంద్రశేఖర్ పూలమాల వేసి నివాళిర్పించారు. సర్పంచ్ రాథోడ్ మధుకర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

ఇంటింటికీ మొక్కల పంపిణీ

ఉట్నూర్‌రూరల్: మండలంలోని ఘన్‌పూర్‌లో సర్పంచ్ పంద్రలత, కార్యదర్శి ప్రవీణ్ ఆధ్వర్యంలో మంగళవారం ఇంటింటికీ మొక్కలు పంపిణీ చేశారు.

ఈవీఎంపై అవగాహన

ఉట్నూర్‌రూరల్: శ్యాంపూర్‌లో మంగళవారం ఉట్నూర్ డిప్యూటీ తహసీల్దార్ భుజంగ్‌రావు ఆధ్వర్యంలో ఈవీఎంలపై అవగాహన కల్పించారు. సర్పంచ్ మల్లిక, గిర్దావర్ శోభరాణి, బీఎల్వోలు ఉన్నారు.

పండ్లు పంపిణీ

ఉట్నూర్‌రూరల్: ఉట్నూర్ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు ఉట్నూర్ మండల ఆర్టీఐ అధ్యక్షుడు బాబా శ్యాం మంగళవారం పండ్లు పంపిణీ చేశారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ ఉపేందర్, డాక్టర్లు ఉన్నారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి

తాంసి: ప్రతి ఒక్కరూ పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని భీంపూర్ ఆరోగ్య కేంద్రం హెచ్ఈవో జ్ఞానేశ్వర్ పేర్కొన్నారు. ధనోరలో కళ్లకలక వ్యాధిబారిన పడిన వారి ఇళ్లను మంగళవారం సందర్శించారు.

ఆలయంలో పూజలు

బోథ్: కుచులాపూర్‌లో అధ్యాపకుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బలరాం జాదవ్ శబరిమాత ఆలయంలో పూజలు చేశారు. ఆలయ నిర్మాణానికి తన వంతు సాయం అందించారు. ఉప సర్పంచ్ దాసు, గోవర్ధన్, మోహన్ రెడ్డి, శ్యామ్ సుందర్, రవీందర్, రంజిత్, చిన్న నారాయణ, భోజన్న ఉన్నారు.

గ్రామాల్లో వైద్యశిబిరాలు

తలమడుగు: మండలంలోని కజ్జర్ల, రుయ్యాడి, చర్లపల్లి గ్రామాలల్లో వైద్యాధికారి హరీష్ వైద్య శిబిరాలు నిర్వహించారు. పలువురికి పరీక్షలు నిర్వహించి అనంతరం మందులను అందజేశారు. సర్పంచ్ పోతరెడ్డి, గ్రామస్తులు ఉన్నారు.

విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు

బోథ్: ప్రతిరోజు విద్యార్థులు పాఠశాలకు హాజరుకావాలని విశ్రాంత ప్రధాన ఉపాధ్యాయుడు పి. లక్ష్మి నర్సయ్య అన్నారు. మండలంలోని సోనాలలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో జూలైలో 16 పని దినాలకుగాను హాజరైన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. హెచ్ఎం మధుసూదన్, ఉపాధ్యాయులు గీతావాణి, శ్రావణి, నాగుబాయి పాల్గొన్నారు.

ఆదివాసీ దినోత్సవాన్ని విజయవంతం చేయాలి

బోథ్: ఈనెల 9న నిర్వహించే ఆదివాసీ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని తుడుం దెబ్బ నాయకులు కోరారు. బోథ్‌లో ఆయన మాట్లాడారు. కార్మికులు, ఉద్యోగులు పాల్గొనాలని కోరారు.

కార్మికుల సమ్మెకు సంఘీభావం

బోథ్: పంచాయతీ కార్మికుల సమ్మె కొనసాగుతోంది. బోథ్ మండల కేంద్రంలో దీక్షలు చేపట్టిన కార్మికులకు ఏఐసీసీ నాయకుడు నరేష్ జాదవ్ మంగళవారం సంఘీభావం ప్రకటించారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

నేరడిగొండ: కుమ్మరుల శాలివాహన నూతన కార్యవర్గాన్ని మండలంలోని కుమారి గ్రామంలో మంగళవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పోతగంటి ప్రవీణ్, ఉపాధ్యక్షుడిగా పోతగంటి శంకర్, కోశాధికారిగా పోతగంటి దమ్మయ్య, సలహాదారులుగా ఆరెపెల్లి రమణయ్య, గజ్జన్న ఎన్నికయ్యారు.

రామకృష్ణ సేవాసమితి ఆధ్వర్యంలో పోటీ పరీక్షలు

ఆదిలాబాద్: స్వామి వివేకానంద రామకృష్ణ మిషన్ స్థాపించి 125 వసంతాలు పూర్తయిన సందర్భంగా శ్రీ రామకృష్ణ సేవ సమితి ఆధ్వర్యంలో ప్రభుత్వ, ప్రైవేట్ ఆంగ్ల మాధ్యమ పాఠశాలల 7, 8, 9, 10వ తరగతి విద్యార్థులకు వివేకానంద కాల్ టూ ది నేషన్ అనే అంశంపై అక్టోబర్‌లో జిల్లాస్థాయి పోటీలు ఉంటాయని అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు భూమన్న, లెనిన్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వివరాలకు సెల్ 9490052842 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

ప్రభుత్వ నిర్ణయంపై హర్షం

ఎదులాపురం: బీడీ టేకేదార్లకు రూ.2016 జీవన భృతి ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపట్ల తెలంగాణ బీడీ కమిషన్ దారుల యూనియన్ (ఐఎఫ్‌టీయూ అనుబంధం) హర్షం వ్యక్తం చేస్తోందని జిల్లా ప్రధాన కార్యదర్శి జగన్‌సింగ్ ఓ ప్రకటనలో తెలిపారు. తమ ఆందోళన ఫలితంగానే సర్కారు నిర్ణయం తీసుకుందని పేర్కొన్నారు.

దేశసేవ చేయడం అదృష్టం



నందుకుమార్‌ను సన్మానిస్తున్న నాయకులు

నేరడిగొండ: దేశ సేవ చేయడం ఎంతో అదృష్టమని విశ్వ హిందూ పరిషత్, బజరంగ్ దళ్, హిందూవాహిని నాయకులు అన్నారు. ఆర్మీలో సేవలందించి ఉద్యోగ విరమణ పొందిన అనంతరం మండలానికి వచ్చిన దాసరి నందుకుమార్‌ను మంగళవారం సన్మానించారు. నాయకులు గోవర్ధన్, సంతోష్ గౌడ్, సురేష్, సాయికిరణ్, సంతోష్‌సింగ్, రాజశేఖర్, సత్యనారాయణ, లక్ష్మణ్, మహేష్, సాయి, తేజు పాల్గొన్నారు.

బియ్యం పంపిణీ



బియ్యం అందిస్తున్న ఆర్ఐ తదితరులు

నేరడిగొండ: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నష్టపోయిన పలు కుటుంబాలకు ఆర్ఐ నాగరావ్ సర్పంచ్ గస్కంటి రవి, డీలర్ గోవర్దన్ మంగళవారం ఆర్థికసాయం అందజేశారు. మండలంలోని గుత్పాల గ్రామంలో ఒక్కో కుటుంబానికి 20 కిలోల చొప్పున బియ్యం పంపిణీ చేశారు. వరదసాయం కింద ప్రభుత్వం 14 కుటుంబాలకు వీటిని అందించినట్లు తెలిపారు. గ్రామస్తులు లక్ష్మణ్, కోళ్లపాక నాగరాజ్, గుమ్ముల అరుణ్, ప్రవీణ్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న భిక్షపతిగౌడ్

నార్నూర్: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని డీఎల్‌పీవో భిక్షపతిగౌడ్ అన్నారు. జామ్‌డా గ్రామంలో వైద్య సిబ్బందితో కలిసి మంగళవారం పర్యటించారు. పారిశుధ్యం, శానిటేషన్ పనులపై ఆరా తీశారు. హెల్త్ సూపర్‌వైజర్ చరణ్‌దాస్ చౌహాన్, ఏఎన్ఎం సుశీల ఉన్నారు.

ఘనంగా శీత్లా పండుగ



పూజలు చేస్తున్న గ్రామస్తులు

నేరడిగొండ: మండలంలోని బొందిడి గ్రామంలో మంగళవారం శీత్లా పండుగను ఘనంగా జరుపుకున్నారు. గ్రామ పెద్దలు గోవింద్‌రావునాయక్, ఉత్తమ్ కారోబారీ, తుకారాం, జాదవ్ సురేశ్, సర్పంచ్ అనిత జనార్దన్ పాల్గొన్నారు.